ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రిక


## సొంతూరిలో సీఎం దసరా సంబరాలు


4లో..

సంపుటి: 2 | సంచిక: 185 | పేజీలు: 4 | వెల: రూ.3/- | సోమవారం 14 అక్టోబర్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

# తెలంగాణ ఉద్యమానికి అలయ్ బలయ్ స్ఫూర్తి

**దసరా అంటే జమ్మిచెట్టు, పాలపిట్ట గుర్తొస్తే.. అలయ్ బలయ్ అంటే దత్తాత్రేయ గుర్తొస్తారు**

**ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన కార్యక్రమం ఇది**
**పొలిటికల్ జేఏసీ ఆవిర్భావానికి మూలమైంది**
**జెండాలను పక్కనపెట్టి అందర్నీ ఏకం చేసింది**
**తెలంగాణ సంప్రదాయాలను కాపాడుకుందాం**
**రాష్ట్ర నేతలు, ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపు**



హైదరాబాద్, అక్టోబర్ 13 (ప్రభాత ఉదయం): దసరా వచ్చిందంటే చాలు గవర్నర్ దత్తాత్రేయ నిర్వహించే అలయ్ బలయ్ గుర్తొస్తుంది. నిత్యం ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకునే నాయకులు ఒకే వేదికపైకి చేరి నవ్వులు పూయిస్తుంటారు. 19 ఏళ్లుగా నిర్విరామంగా ఈ కార్యక్రమం జరుగుతోంది. ఈ ఏడాది అలయ్ బలయ్ కార్యక్రమాన్ని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో అట్టహాసంగా నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఉత్తరాఖండ్ గవర్నర్ గుర్మీత్ సింగ్, మేఘాలయ గవర్నర్ విజయ్ శంకర్, రాజస్థాన్ గవర్నర్ హరిభౌ కిసన్ రావ్ బాగ్డే, ఇంకా ఇతర నేతలు ..మిగతా 4లో

## తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి పథాన నడవాలి: బండారు దత్తాత్రేయ



హైదరాబాద్, అక్టోబర్ 13 (ప్రభాత ఉదయం): తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ముఖ్యమంత్రులు కలిసి మెలసి అభివృద్ధి కోసం పరస్పరం పని చేయాలని హర్యానా గవర్నర్ దత్తాత్రేయ ఆకాంక్షించారు. రాజకీయాలకు అతీతంగా పరస్పరం సహకరించుకోవాలన్నారు. ఐకమత్యంతో ముందుకెళ్లాలని, దేశంలోనే తెలుగు రాష్ట్రాలను అగ్రభాగాన నిలపాలని కోరారు. 2005లో రాజకీయాలకు సంబంధం లేకుండా, ప్రేమ, ఆప్యాయత, అనురాగాల కోసం అలయ్ బలయ్‌ను ప్రారంభించామన్నారు. ప్రేమ, ఆత్మీయత, ఐక్యతను చాటుకోవాలన్నదే అలయ్ బలయ్ లక్ష్యమని పేర్కొన్నారు. పలువురు గవర్నర్లు రావడంతో దేశమంతా నగరానికి వచ్చినట్టుగా అనిపించిందని చెప్పారు. ప్రతి ఒక్కరి ..మిగతా 4లో

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీకి చీఫ్ విప్ ఎలా ఇస్తారు

**ఇది రాజ్యాంగ విరుద్ధం: ఎమ్మెల్యే హరీశ్ రావు**
**అనర్హత వేటు వేయకుండా పదవులా?**
**రేవంత్ హయాంలో రాజ్యాంగం ఖూనీ**
**పీఏసీ చైర్మన్ విషయంలోనూ ఇదే తంతు**
**ప్రభుత్వంపై మండిపడ్డ హరీష్ రావు**



హైదరాబాద్, అక్టోబర్ 13 (ప్రభాత ఉదయం): తెలంగాణ శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ మధుసూదనాచారి బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఆపార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నేతలు హాజరయ్యారు. మధుసూదనాచారికి కేటీఆర్ పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. తనకు అప్పగించిన బాధ్యతను అంకితభావంతో నిర్వహిస్తానని చెప్పారు మధుసూదనాచారి.

**అనర్హత వేయకుండా పదవిస్తారా**

మరోవైపు, చీఫ్ విప్‌గా బీఆర్ఎస్ ఎమ్మెల్సీని నియమించడం కరెక్ట్ కాదంటూ మాజీ మంత్రి హరీష్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగ విరుద్ధంగా పట్నం మహేందర్ రెడ్డికి పదవి కట్టబెట్టారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన పట్నం మహేందర్ రెడ్డికి చీఫ్ విప్ పదవి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. అనర్హత వేటు వేయాల్సిన కౌన్సిల్ ఛైర్మన్ స్వయంగా, ఆయన్ను చీఫ్ విప్‌గా ఎంపికైనట్లు బులెటిన్ ఇవ్వటం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేశారు.

**రాజ్యాంగ ఉల్లంఘన**

పట్నం అనర్హత పిటిషన్ కౌన్సిల్ ఛైర్మన్ దగ్గర పెండింగ్‌లో ఉందన్న హరీష్ రావు, రేవంత్ హయాంలో రాజ్యాంగం ఎలా ఖూనీ జరుగుతుందనే దానికి ఇదొక ఉదాహరణగా పేర్కొన్నారు. పీఏసీ చైర్మన్ పదవి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాగే వ్యవహరించిందని, అరికెపూడి గాంధీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అని స్వయంగా సీఎం, మంత్రులు చెప్పారని గుర్తు చేశారు. పట్నం మహేందర్ రెడ్డి ఏ పార్టీకి చెందిన వ్యక్తో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు.




## వచ్చే నెలలో ట్రిపుల్‌ఆర్ టెండర్!

**ఉత్తర భాగానికి నోటిఫికేషన్ జారీ చేయనున్న ఎన్‌హెచ్ఏఐ**
**అందుకు వీలుగా టెండర్ డాక్యుమెంటేషన్ ప్రక్రియ కొలిక్కి**
**పర్యావరణ అనుమతులు వచ్చాక నిర్మాణ సంస్థ ఖరారు**
**ఈలోపు రోడ్డు నంబర్ కేటాయింపు.. అటవీ అనుమతుల జారీ**

2

## గతిశక్తికి ప్రధాని మోదీ థ్యాంక్స్

**భారత్ భవిష్యత్ పై కీలక మార్గనిర్దేశం**

న్యూఢిల్లీ, అక్టోబర్ 13 (ప్రభాత ఉదయం): ప్రధానమంత్రి గతిశక్తి ప్రాజెక్టు గురించి ప్రధాని నరేంద్ర మోదీ సోషల్ మీడియా ద్వారా స్పందించారు. గతిశక్తి ప్రాజెక్టు ద్వారానే వికసిత్ భారత్ లక్ష్యాన్ని మరింత వేగంగా చేరుకోగలమని ప్రధాని నరేంద్ర మోదీ వివరించారు.

**విప్లవాత్మకమైన మార్పులకే గతిశక్తి..**

మౌలిక సదుపాయాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చేందుకే గతిశక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్‌కు రూపకల్పన చేశామని మోదీ అన్నారు. ఫలితంగానే భారత్ అన్ని మౌలిక రంగాల్లో మరింత వేగవంతంగా, సమర్థవంతంగా అభివృద్ధి చెందుతోందని చెప్పుకొచ్చారు. పలు ఆర్థిక ప్రణాళికలకు మల్టీ-మోడల్ కనెక్టివిటీ ఇన్ఫ్రాస్ట్రక్షర్ అందించేందుకే గతిశక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్‌ను 2021,



## మేయర్ గద్వాల విజయలక్ష్మిపై కేసు నమోదు



**కేసు నమోదు చేసిన హైదరాబాద్ పోలీసులు**
**సద్దుల బతుకమ్మ వేడుకల్లో డీజే వాడకపై కేసు**

హైదరాబాద్, అక్టోబర్ 13 (ప్రభాత ఉదయం): జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మిపై కేసు నమోదైంది. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో గురువారం (అక్టోబర్ 10న) రోజున జరిగిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో.. సమయం దాటిన తర్వాత కూడా పెద్ద ఎత్తున డీజే సౌండ్స్ పెట్టుకుని.. నృత్యాలు చేయటంపై పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేశారు. మేయర్ విజయలక్ష్మితో ..మిగతా 2లో



## మీకు ప్రతీది రాజకీయమేనా?

**హరీశ్ రావుకు మంత్రి శ్రీధర్ బాబు ప్రశ్న**
**రాజ్యాంగం ప్రకారమే నియామకాలు**
**ప్రతీ విషయాన్ని రాజకీయం చేయడం తగదు**
**బీఆర్ఎస్ హయాంలో కాంగ్రెస్ నేతల్ని ఎందుకు చేర్చుకున్నారు?**
**వ్యవస్థల్ని రాజకీయాల్లోకి లాగడం మంచిది కాదు**
**హరీష్ రావుకు మంత్రి శ్రీధర్ బాబు కౌంటర్**

హైదరాబాద్, అక్టోబర్ 13 (ప్రభాత ఉదయం): మండలిలో ప్రతిపక్ష నేతగా ఎంపికైన మధుసూదనాచారిని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి శ్రీధర్ బాబు కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. అనంతరం ..మిగతా 2లో

# మాజీమంత్రి సబితా ఇంద్రా రెడ్డికి దసరా శుభాకాంక్షలు తెలిపిన రాజేంద్రనగర్ నాయకులు



బుద్వేల్, అక్టోబరు13(ప్రభాత ఉదయం): మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం శాసనసభ్యురాలు పి. సబితా ఇంద్రారెడ్డి ని రాజేంద్రనగర్ బీఆర్ఎస్ నాయకులు ఆదివారం వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలియజేసారు. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ సుభాష్ రెడ్డి , డి రమేష్ ముదిరాజ్, జాలిగం చిత్తారి, సుధాకర్ ముదిరాజ్, మహేందర్ ముదిరాజ్, శివ ముదిరాజ్, మహేష్ ముదిరాజ్, సంతు తదితరులు ఉన్నారు.

మాజీ మంత్రి పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి ని కలసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలువుతున్న కొలన్ సుభాష్ రెడ్డి, జాలిగం చిత్తారీ తదితరులు



రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ ను కలసి సన్మానిస్తున్న పలుగుచెరువు మహేష్, అనుముల జాన్ పాల్, తదితరులు

## వచ్చే నెలలో ట్రిపుల్‌ఆర్ టెండర్!

**ఉత్తర భాగానికి నోటిఫికేషన్ జారీ చేయనున్న ఎన్‌హెచ్ఏఐ**
**అందుకు వీలుగా టెండర్ డాక్యుమెంటేషన్ ప్రక్రియ కొలిక్కి**
**పర్యావరణ అనుమతులు వచ్చాక నిర్మాణ సంస్థ ఖరారు**
**ఈలోపు రోడ్డు నంబర్ కేటాయింపు..**
**అటవీ అనుమతుల జారీ**

హైదరాబాద్, అక్టోబర్ 13 (ప్రభాత ఉదయం): ట్రిపుల్‌ఆర్ (రీజినల్ రింగురోడ్డు) నిర్మాణానికి కేంద్రం వేగంగా ఏర్పాట్లు చేస్తోంది. దీనికి వీలుగా ఎన్‌హెచ్ఏఐ ట్రిపుల్‌ఆర్ ఉత్తర భాగం టెండర్ డాక్యుమెంటేషన్‌పై దృష్టి సారించింది. వచ్చే నెల మొదటి వారంలో టెండర్లు పిలిచే అవకాశాలున్నాయి.

### పర్యావరణ అనుమతులు రాకుండానే..

ట్రిపుల్‌ఆర్ విషయంలో ఇప్పటికే తీవ్ర జాప్యం జరిగింది. దీంతో భవిష్యత్‌లో మరింత ఆలస్యం జరగకుండా చూడాలని ఎన్‌హెచ్ఏఐ భావిస్తోంది. పర్యావరణ అనుమతులు రాకుండా టెండర్ల ప్రక్రియ పూర్తి చేయటానికి వీలులేదు. కానీ, టెండర్లు పిలిచేందుకు అది అడ్డంకి కాదు. దీంతో పర్యావరణ అనుమతులు వచ్చేలోగా టెండర్లు పిలిచి, పర్యావరణ అనుమతులు వచ్చిన తర్వాత టెండర్లు ఖరారు చేయాలని అధికారులు భావిస్తున్నారు. టెండర్లు తెరిచే నాటికి అనుమతులు వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

### ఎక్స్‌ప్రెస్‌వేగా కొత్త నంబర్

జాతీయ రహదారి హోదాలో కేంద్రం ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టు చేపడుతోంది. ఉత్తర భాగం విషయంలో ఆ స్పష్టత ఉంది. దక్షిణభాగాన్ని కేంద్రం కాకుండా సొంతంగానే చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఉత్తర భాగాన్ని సొంత నిధులతో కేంద్రమే నిర్మిస్తోంది. గతంలో కేవలం జాతీయ రహదారిగా మాత్రమే దాన్ని పరిగణించింది. కానీ, ఇటీవల దాన్ని ఎక్స్‌ప్రెస్‌వే జాబితాలో చేర్చింది. అప్పటి వరకు తాత్కాలికంగా దానికి 161ఏ నంబర్‌ను పరిగణనలోకి తీసుకున్నారు. ఇప్పుడు అది కాకుండా ఎక్స్‌ప్రెస్‌వేగా కొత్త నంబర్ కేటాయించనున్నారు. ఈ నంబర్ అలాట్ అయిన తర్వాతే ఫారెస్టు క్లియరెన్సు వస్తుంది. ఇప్పటికే ఈ రోడ్డుకు సంబంధించి పబ్లిక్ హియరింగ్స్ ప్రక్రియ పూర్తి చేశారు. పర్యావరణ అనుమతులకు అది కీలకం.

రోడ్డు నంబర్ అలాట్ అయిన తర్వాతనే పర్యావరణ అనుమతులకు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. త్వరలో ఆ రోడ్డు నంబర్ కేటాయించే అవకాశముంది. పర్యావరణ అనుమతులు వచ్చిన తర్వాతే టెండర్లు తెరవాల్సి ఉంటుంది. ఈ తతంగం పూర్తయ్యే వరకు టెండర్ల కోసం ఎదురు చూడకుండా, ముందు నోటిఫికేషన్ జారీ చేయాలని అధికారులు నిర్ణయించారు. మరోవైపు భూపరిహారం పంపిణీకి వీలుగా గ్రామాల వారీ అవార్డులు పాస్ చేసే ప్రక్రియ కూడా నిర్వహించాల్సి ఉంది.

ఇది జరగాలంటే పరిహారం నిధులు ఎన్‌హెచ్ఏఐకి కేటాయించాలి. ఉత్తర భాగం భూసేకరణ వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వం సగం మొత్తాన్ని భరించాల్సి ఉన్నందున, ఆ నిధులు రాష్ట్ర ప్రభుత్వం డిపాజిట్ చేయాలి. ఈ ప్రక్రియ కూడా వేగంగా పూర్తి చేసేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని ఎన్‌హెచ్ఏఐ నిర్ణయించింది. సమాంతరంగా ఈ ఏర్పాట్లు చేస్తూనే టెండర్ల ప్రక్రియ ప్రారంభించబోతున్నారు. వచ్చేనెల మొదటి వారంలో టెండర్లు పిలిచి నిర్ధారిత గడువులోపు నిర్మాణ సంస్థను ఖరారు చేయనున్నారు. ఆ తర్వాత వీలైనంత తొందరలో పనులు ప్రారంభించాలని కేంద్రం భావిస్తోంది.

## మేయర్ గద్వాల విజయలక్ష్మిపై కేసు నమోదు

మొదటి పేజీ తరువాయి...



పాటు ఈవెంట్ నిర్వాహకుడు, డీజే సౌండ్స్ నిర్వాహకుడిపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. సద్దుల బతుకమ్మ వేడుకల సమయంలో.. డీజేలు పెట్టటం సర్వత్రా చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. అయితే.. ఇప్పటికే హైదరాబాద్‌లో డీజేలను నిషేధించిన విషయం తెలిసిందే. అయితే.. బతుకమ్మ వేడుకల్లో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి డీజేలు పెట్టటటమే కాకుండా.. తల్వార్ పట్టుకొని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. " కొందరు ఓర్వలేక పోలీసులను ఉసిగొల్పినా.. అక్క ఉన్నంతవరకు ఎవ్వరూ కూడా భయపడనక్కర్లేదు. పోలీసులు వచ్చినా ఏం చెయ్యలేరు.. నేనున్నా... ఇవాళ ఈ తల్వార్ నేను పట్టుకున్నా.. రేపు మీరు పట్టుకోవాలి." అంటూ గద్వాల విజయలక్ష్మి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో.. సామాన్య ప్రజలకు ఒక రూల్.. మేయర్‌కు ఒక రూలా అంటూ నగరవాసుల నుంచి నెట్టింట పెద్ద ఎత్తున ప్రశ్నలు వెల్లువెత్తాయి. దీంతో.. ఈ వ్యవహారంపై స్పందించిన హైదరాబాద్ పోలీసులు.. సుమోటోగా కేసు నమోదు చేశారు. అయితే.. హైదరాబాద్‌లో డీజేలు, ఫైర్ క్రాకర్స్ మీద నిషేదం విధిస్తూ అక్టోబర్ ఒకటో తారీఖున సీపీ సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. డయల్ 100కు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా నగరంలోని.. మత పెద్దలతో సమావేశం నిర్వహించిన సీపీ సీవీ ఆనంద్.. ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. నగరంలో డీజేలు, సౌండ్ మిక్సర్‌లు, హైసౌండ్ ఎక్యూప్‌మెంట్, క్రాకర్స్‌పై నిషేదం విధిస్తున్నట్లు ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ఈ నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. స్కూళ్లు, కాలేజీలు, ఆసుపత్రులు, కోర్టులకు 100 మీటర్ల వరకు నిషేదం అమల్లో ఉంటుందన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే.. బీఎన్ఎస్ చట్టం ప్రకారం ఐదేళ్ల జైలు శిక్ష, ఫైన్ కూడా విధిస్తామని సీపీ సీవీ ఆనంద్ హెచ్చరించారు. అయితే.. మేయర్ విజయలక్ష్మి మాత్రం సద్దుల బతుకమ్మ వేడుకల్లో 10 గంటలు దాటిన తర్వాత కూడా డీజే పెట్టటం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. కేవలం డీజే పెట్టటమే కాకుండా.. సంచలన వ్యాఖ్యలు కూడా చేయటంపై నెట్టింట తీవ్ర విమర్శలు ఎదురయ్యాయి.




## మార్కండేయనగర్ శ్రీవీరాంజనేయ పొదుపు సంఘం నూతన పాలకవర్గం ఎన్నిక

**అధ్యక్షుడిగా గద్దె యాదగిరి**

మైలార్ దేవ్ పల్లి ,అక్టోబర్13(ప్రభాత ఉదయం) పొదుపరితనం ప్రతి ఒక్కరిలో ఉన్నప్పుడే ఆర్థికంగా ఎదగవచ్చని మార్కండేయనగర్ శ్రీవీరాంజనేయ పొదుపు సంఘం అధ్యక్షుడు గద్దె యాదగిరి అన్నారు. శనివారం విజయదశమి పర్వదినం సందర్భంగా దేవాలయం అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన పొదుపు సంఘం నూతన పాలకవర్గం ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. దేవాలయం అభివృద్ధి కోసం 2022లో ఏర్పాటు చేసిన ఈ సంఘం గత రెండు సంవత్సరాలుగా 275 మంది సభ్యులతో 50 లక్షల టర్నవర్తో ముందుకు సాగుతుంది. సంఘం పాలకవర్ణం నూతన అధ్యక్షుడిగా గద్దెయాదగిరి ని ఏకగ్రీవంగా పాలకవర్గం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ.. దేవాలయాల అభివృద్ధి వాటి నిర్వాహణ జరుగడానికి పొదుపు సంఘాలు ఎంతో దోహదపడుతాయని అన్నారు. నిత్య పూజలకు అయ్యే ఖర్చులను పొదుపు సంఘాల ద్వారా వచ్చే ఆదాయాన్ని దేవాలయాలకు ఖర్చు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ దేవాలయంలో పొదుపులు చేసుకొని దేవాలయ అభివృద్ధికి సహకరించాలని సూచించారు.వీరాంజనేయ పొదుపు సంఘం నూతన పాలకవర్గం అధ్యక్షుడిగా గద్దెయాదగిరి. ఉపాధ్యాయుడిగా గది సౌడయ్య. కోట పవన్ ప్రధాన కార్యదర్శిగా బాస క్రిష్ణ సహాయకార్యదర్శిగా వర్కాల చందు. కోషాధికారిగా గంజి ధనుంజయ్ పాలకవర్గం సభ్యులుగా బాత్కు విజయ్ గంజి జగదీష్ .ఉదుత సూరి, రావుల నవీన్ గుత్తి మల్లేష్ లు ఎన్నికయ్యారు.

## మీకు ప్రతీది రాజకీయమేనా?

మొదటి పేజీ తరువాయి...



మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు మంత్రి. ఈ సందర్భంగా హరీష్ రావు వ్యాఖ్యలపై స్పందించారు. ప్రతిదాన్ని రాజకీయం చేయటం హరీష్ రావుకు అలవాటుగా మారిందన్నారు. ఆయన వ్యవస్థలను కూడా రాజకీయాల్లోకి లాగుతున్నారని ఫైరయ్యారు.

### అప్పుడు రాజ్యాంగం గుర్తుకు రాలేదా ?

రాజ్యాంగానికి లోబడే పట్నం మహేందర్ రెడ్డిని మండలి చీఫ్ విప్‌గా నియమించినట్టు స్పష్టం చేశారు. హరీష్ రావు శాసనసభ వ్యవహారాల మంత్రిగా ఉన్నప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో ఎలా చేర్చుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలో హరీష్ రావుకు రాజ్యాంగం గుర్తుకు రాలేదా అని నిలదీశారు. పీఏసీ ఛైర్మన్ పదవిని సంప్రదాయం ప్రకారం ప్రతిపక్షానికే ఇచ్చామని, ఎమ్మెల్యేల అనర్హత వేటు అంశం కోర్టు పరిధిలో ఉందని గుర్తు చేశారు శ్రీధర్ బాబు.

### అంతా బురదజల్లె కార్యక్రమం

ఏ నియామకం జరిగినా రాజ్యాంగ బద్ధంగానే ఉంటుందన్నారు. రాజకీయంగా ఏదైనా బురదజల్లే కార్యక్రమం చేయాలంటే వ్యవస్థలను ఉపయోగించడం కరెక్ట్ కాదని మండిపడ్డారు. తమ ప్రభుత్వంలో ఎక్కడా రాజ్యాంగ ఉల్లంఘన జరగడం లేదని స్పష్టం చేశారు. పీఏసీ చైర్మన్, చీఫ్ విప్ నియామకాలు రాజ్యాంగం ప్రకారమే జరిగాయని చెప్పారు మంత్రి.



ధ్వంసమైన కారు



మత్తులో ఉన్న యువకుల దాడిలో గాయపడ్డ అనిల్ కుమార్



మందుబాబుల ఆగడాలను అరికట్టాలంటున్న స్థానికులు

## రాజేంద్రనగర్ సర్కిల్ ఎర్రబోడలో రెచ్చిపోయిన మందు బాబులు

బుద్వేల్, అక్టోబరు13(ప్రభాత ఉదయం): వాకింగ్ చేసి ఇంటికి వస్తున్న ఓ వ్యక్తి పై మత్తులో ఉన్న ఐదుగురు యువకులు దాడి చేసి గాయపరిచారు. ఆదివారం ఉదయం ఈ సంఘటన రాజేంద్రనగర్ సర్కిల్ ఎర్ర బోడ నలందనగర్ లో జరిగింది. వివరాలలోకి వెళితే నలంద నగర్ కు చెందిన అనిల్ కుమార్ ఆదివారం ఉదయం వాకింగ్ కు వెళ్లి బైక్ పై ఇంటికి వస్తున్నాడు. అతనికి సైట్ ఉండటంతో కళ్ళద్దాలు పెట్టుకున్నాడు. ఆ ప్రాంతంలో కూర్చున్న ఐదుగురు యువకులు అరేయ్ ఇటు రా అని పిలిచి... మా ముందే కళ్ళద్దాలు పెట్టుకుంటావా తీయ్ అంటు అనడంతో గొడవ మొదలైంది. అలా ఎందుకు అంటున్నారు అంటే కర్రలతో దాడి చేసి గాయపరిచారు. అడ్డు వచ్చిన వారి పై సైతం దాడి చేసి గాయపరిచారు. పార్కింగ్ చేసిన కారు అద్దాలు ధ్వంసం చేశారు. తరచూ మత్తులో ఉండి వచ్చి పోయే వారి పై పోకిరీలు దాడి చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. అనిల్ కుమార్ రాజేంద్రనగర్ పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## గతిశక్తికి ప్రధాని మోదీ థింక్స్

మొదటి పేజీ తరువాయి...

అక్టోబర్ 13న అమల్లోకి తీసుకువచ్చామన్నారు. మూడేళ్ల కింద ప్రారంభమైన దీని గురించి ప్రధాని మాట్లాడారు.

### మల్టి మోడల్ ఇన్ఫ్రాస్ట్రక్షర్ కోసమే

దేశంలోని విమానాశ్రయాలు, రైల్వే, రోడ్లు, జలమార్గాలు, ఓడరేవులు, లాజిస్టిక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి వాటి అభివృద్ధిలో గతిశక్తిదే కీలక పాత్ర అన్నారు. వికసిత్ భారత్ లక్ష్యాన్ని మరింత వేగంగా చేరుకోవాలంటే అందుకు గతిశక్తి ఒక్కటే సాధనంగా ఉపయోగపడుతుందన్నారు. అంతేకాకుండా ఇది కొత్త ఆవిష్కరణలకు సైతం ఊతమిస్తుందన్నారు.

## జమ్మి చెట్టు పెంచి మతసామరస్యాన్ని కాపాడిన గ్రామస్తులు

**జమ్మి చెట్టును సంరక్షించిన మదగం పెద్ద రాములు ను సన్మానించిన మాజీ సర్పంచ్ మూల మల్ల భీమ్ రెడ్డి**

కొత్త కోట, అక్టోబర్ 13(ప్రభాత ఉదయం) మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలో దసరా పండుగ వేడుకలు భక్తిశ్రద్ధలతో గ్రామస్తులు జరుపుకున్నారు. గ్రామంలో దసరా పండుగ సందర్భంగా నూతనంగా జమ్మి చెట్టు కట్ట నిర్మించిన ఎండి నజీర్ , చెట్టును సంరక్షించిన మధుగం పెద్ద రాములు ను గ్రామ పెద్దలు, వనపర్తి రోడ్ మాజీ మార్కెట్ చైర్మన్ మూలమల్ల రాజేశ్వరి భీమ్ రెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మూలమల్ల వెంకటేశ్వర్ రెడ్డి , గ్రామ ప్రజలు పాల్గొన్నారు.




జమ్మి చెట్టును సంరక్షించిన పెద్ద రాములు సన్మానిస్తున్న మాజీ సర్పంచ్ మూల మల్ల భీమ్ రెడ్డి



ఏపుగా పెరిగిన జమ్మి చెట్టు

# బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు, బుద్వేల్‌కు చెందిన మూల శ్రీనివాస్ గౌడ్ అనారోగ్యంతో మృతి

బుద్వేల్, అక్టోబరు13(ప్రభాత ఉదయం) : గత మూడు నెలలుగా అనారోగ్యం తో బాధ పడుతున్న బీజేపీ రంగా రెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు, బుద్వేల్ నివాసి మూల శ్రీనివాస్ గౌడ్ ( 52) శనివారం రాత్రి 10 గంటలకు మృతి చెందారు. అకస్మాత్తుగా ఆరోగ్యం క్షీణించడం తో చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకెళ్లగా అర్ధ రాత్రి 1. 00 గం లకు ప్రాణాలు కోల్పోయారు. మూల శ్రీనివాస్ గౌడ్ అంతిమ యాత్ర ఆదివారం మధ్యాన్నం జరిగింది. బుద్వేల్ స్మశాన వాటికలో అంత్యక్రియలు జరిగాయి. రాజేంద్రనగర్ అసెంబ్లీ లో మూల శ్రీనివాస్ గౌడ్ పార్టీ కోసం ఎంత గానో పని చేసారన్నాను. 1987 నుండి మూల శ్రీనివాస్ గౌడ్ బీజేపీ పార్టీ అంటే పిచ్చి అభిమానం అన్నారు. బుద్వేల్ లో ఒకే ఒక్కడుగా నిలబడి. ఎన్ని ఇబ్బందులు పెట్టిన ఎన్ని బాధలు పెట్టిన పార్టీ ని నమ్ముకొని పనిచేస్తూ కార్యకర్తలను తయారు చేస్తు మొండిగా నిలబడి కష్టానికి, నిష్టురానికి తను నమ్ము కున్న సిద్ధాంతం కోసం దేశం కోసం, ధర్మం కోసం, పని చేసారన్నారు. రాత్రనక పగలనక తిండి తిప్పల లేక చేయని నేరానికి జైలు పాలు అయ్యి కుటుంబ సభ్యులకు ఎంతో దుఃఖం చేకూరిన బుద్వేల్ లోని 13 బూత్ లుండగా, 8 బూత్ లలో ఇతర పార్టిలకంటే బీజేపీ మెజారిటీ సాధించడం శ్రీనివాస్ గౌడ్ వలననే అని చెప్పక తప్పదన్నారు. నేను చనిపోతే బీజేపీ జెండా కప్పాలి అని అనేక సార్లు అనేవాడని గుర్తు చేశారు. ఎంత పెద్ద నాయకులతో ఐన ముక్కు సూటిగా మాట్లాడేవాడన్నారు. బుద్వేల్ లో బీజేపీ అంటే శ్రీనివాస్ గౌడ్ అని అన్నారు. అతను లేని లోటు తీర్చలేమన్నారు. శ్రీనివాస్ గౌడ్ కు భార్య మూల లత, ఇద్దరు కుమారులు మూల యశ్వంత్ గౌడ్, మూల ప్రణవ్ గౌడ్ లు ఉన్నారన్నారు. శ్రీనివాస్ అంతిమ యాత్రలో బీజేపీ నాయకులు అమర్ హై ..?అమర్ హై ......శ్రీనివాస్ గౌడ్ అని, జోహార్ శ్రీనివాస్ గౌడ్.... జోహార్ జోహార్ అని నినాదాలు చేశారు. అంతిమ యాత్ర లో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంజన్ కుమార్ గౌడ్, జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్ , కార్పొరేటర్ తొకల శ్రీనివాస్ రెడ్డి, చేవెళ్ళ పార్లమెంట్ కన్వీనర్ ఎన్. మల్లా రెడ్డి , జిల్లా కార్యదర్శి ఎం కొమరయ్య, అసెంబ్లీ కన్వీనర్ పి మల్లేష్ యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరని సదానంద్, సీనియర్ నాయకులు బి. కుమార్, లోహిత్ రెడ్డి, వెంకటేష్. డివిజన్ అధ్యక్షులు జి బాబురావు, షాబాధ విజయ్ కుమార్, అడికే జనార్ధన్, రావుల భాస్కర్ , మొంద్ర గౌరీ శంకర్, డి. సత్యనారాయణ, జోగి రవి, బండారి బాలకృష్ణ, ఎన్. జగన్, ఈ .వేణుగోపాల్, టీ మల్లేష్ , భాస్కర్ యాదవ్, రాఘవేందర్, రాపర్తి రాకేష్ గౌడ్, స్థానిక నాయకులు పెంటన్న , దేవేందర్ గౌడ్, చంద్రమౌళి గౌడ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు .


మూల శ్రీనివాస్ గౌడ్..


మూల శ్రీనివాస్ గౌడ్ అంతిమయాత్రలో పాల్గొన్న బీజేపీ నాయకులు



విజయ దశమి పర్వదినం సందర్భంగా రాజేంద్రనగర్ లోని శ్రీ మాతా పోచమ్మ దేవాలయం లో భక్తులకు విశేష అలంకరణలో దర్శనం ఇచ్చిన అమ్మ వారు


చిన్న అనంతగిరి శివాలయం ఆవరణలో రావణ దహనం

# రావణ దహనం

బుద్వేల్, అక్టోబరు13(ప్రభాత ఉదయం): దసరా పర్వదినని పురస్కరించుకొని రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ చిన్న అనంతగిరి దేవాలయంలో ప్రణవ భక్త సమాజం మొండ నర్సింహ ఆధ్వర్యంలో దసరా సంబరాలు, రావణ దహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్ని పార్టీల నేతలు పాల్గొన్నారు... రావణ దహన కార్యక్రమం అనంతరం ప్రతి ఒక్కరు జమ్మిచెట్టు పంచుకొని ఒకరికొకరు ఆత్మీయ ఆలింగణం చేసుకొని దసరా శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

# విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి

బుద్వేల్, అక్టోబరు13(ప్రభాత ఉదయం) : విజయదశమి రోజు మైలార్ దేవ్ పల్లి లో విషాదం చోటుచేసుకుంది. విద్యుత్ గాతం తో రమేశ్ కుమార్ అనే కార్మికుడు మృతి చెందాడు. మూవర్స్ అండ్ ప్యాకర్స్ లో సామాన్లు అన్ లోడ్ చేస్తుండగా రమేశ్ కు విద్యుత్ గాతం అయింది. స్పాట్ లో రమేష్ అనే యువకుడు మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


విద్యుత్ షాక్‌తో మరణించిన రమేష్ కుమార్



# మైలార్‌దేవ్‌పల్లిలో జమ్మి పూజలో పాల్గొన్న కార్పోరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

బుద్వేల్, అక్టోబరు 13 (ప్రభాత ఉదయం): రాజేంద్ర నగర్ నియోజక వర్గ పరిధిలోని పల్లె చెరువు వద్ద దసరా వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. దసరా పండుగ ను పురస్కరించుకొని శ్రీ బల రామా కృష్ణ భక్త భజన మండలి కమిటీ ఆద్వర్యం లో నిర్వహించిన జమ్మి చెట్టు ప్రత్యేక పూజ కార్యక్రమంలో రాజేంద్ర నగర్ నియోజక వర్గ కాంటెస్టడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం రావణ దహనం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలందరి కి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేసారు.


తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను కలసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు పలుగు చెరువు మహేష్, గంగని అరుణ్ కుమార్ లు



నౌ నెంబర్ వద్ద బందోబస్తు లో ఉన్న రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్

# దసరా పండుగ రోజున భక్తి శ్రద్ధలతో సిక్కు సోదరుల ర్యాలీ

బుద్వేల్, అక్టోబరు13(ప్రభాత ఉదయం) : దసరా పండుగ రోజున సిక్కు సోదరులు నిర్వహించే ర్యాలీ భక్తి శ్రద్ధలతో జరిగింది. సిక్ చావునీ కి చెందిన వందలాది మంది సిక్కు సోదరులు వారి కుటుంబ సభ్యులతో కలిసి ర్యాలీ లో పాల్గొన్నారు. ర్యాలీ సందర్భంగా రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్, ఏసీపీ తుల శ్రీనివాస్, ఇన్స్ పెక్టర్ వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



బందోబస్తు లో డీసీపీ చింతమనేని శ్రీనివాస్, ఏసీపీ తుల శ్రీనివాస్


అక్రమంగా డంపు చేసిన ఇసుక

# ఇసుక అక్రమ దందా


### బహిరంగంగా ఇసుక డంపుల నిర్వహణ
### చోద్యం చూస్తున్న అధికారులు
### అక్రమ దందాను అడ్డుకోవాలని రైతుల వేడుకోలు

గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 13(ప్రభాత ఉదయం)కేటిదొడ్డి మండలంలో కొన్ని రోజులుగా ఇసుక అక్రమ దందా మూడు 'పూలు..ఆరు కాయలు' అన్న చందంగా సాగుతోంది. ఇసుక అక్రమ దందాను అడ్డుకోవాల్సిన అధికారులు తమకేమీ పట్టదన్నట్లు వ్యవహరిస్తున్నారు. కేటిదొడ్డి మండలంలోని గువ్వలదిన్నె వాగు నుంచి పెద్ద ఎత్తున కొంతమంది ఇసుకను అక్రమంగా రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వాగు నుంచి అడ్డదిడ్డంగా ఇసుకను తోడేస్తుండడంతో వట్టిపోతోంది. రాత్రి, పగలు అనే తేడా లేకుండా రోజూ ట్రాక్టర్ల ద్వారా వివిధ ప్రాంతాలకు ఇసుకను తరలిస్తున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. వాగు నుంచి పెద్ద ఎత్తున ఇసుక అక్రమంగా రవాణా చేస్తుండడంతో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయని రైతులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల అండదండలతో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఠంచనుగా అందుతున్న మామూళ్లతో అధికారులు అక్రమ ఇసుక రవాణాపై దృష్టి సారించడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అసలే అంతంత మాత్రంగా భూగర్భజలాలు ఉండగా ఇసుక అక్రమ రవాణా కారణంగా భూగర్భజలాలు మరింత అడుగంటిపోయే పరిస్థితులు నెలకొన్నాయని వాగు పరిసర రైతులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. సామాన్యులు ఇళ్ల నిర్మాణాలకు ఇసుక అవసరం వస్తే సవాలక్ష నిబంధనలు చెప్పే అధికారులు ఇసుక అక్రమ రవాణాదారుల విషయంలో మాత్రం నోరు మెదపకుండా చోద్యం చూస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో ట్రాక్టర్ ఇసుకకు రూ. 6 వేల వరకు సంపాదిస్తు అక్రమార్కులు తమ వ్యాపారాని కొనసాగిస్తున్నారు. మండలంలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**పర్మిషన్ ఇవ్వలేదు.. శివశంకర్, డిటీ- కేటిదొడ్డి**

గువ్వల దిన్నె వాగునుంచి అక్రమంగా ఇసుకను తరలించేందుకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. వాగునుంచి అక్రమంగా తోడేసిన ఇసుక డంప్ లను గుర్తించి సీజ్ చేస్తాం.

# మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా రెడ్డికి దసరా శుభాకాంక్షలు తెలిపిన మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్, నాయకులు


మాజీ మంత్రి సబితా రెడ్డి శాలువా , స్వీట్లు అందజేస్తున్న మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్


యువనేత కార్తీక్ రెడ్డి ని సన్మానిస్తున్న మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్, మాజీ వార్డ్ కమిటీ సభ్యులు సోమ శ్రీనివాస్ గుప్త

రాజేంద్రనగర్, అక్టోబర్ 13(ప్రధాత ఉదయం) దసరా పండుగ పురస్కరించుకొని మాజీ మంత్రి, మహేశ్వరం శాసనసభ్యురాలు పి సబితా ఇంద్రారెడ్డి కి రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్ కి చెందిన నాయకులు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గం లోని బాలాపూర్ చౌరస్తాలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి సబితా రెడ్డిని బాబుల్ రెడ్డి నగర్ మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్ ఆధ్వర్యంలో స్థానిక నాయకులు సబితా రెడ్డికి శాలువా అందజేసే స్వీట్లు అందజేశారు. సబితా రెడ్డి బాబు రెడ్డి నగర్ నుంచి వచ్చిన నాయకులందరికి దసరా శుభాకాంక్షలు తెలిపి మిఠాయిలు పంచిపెట్టారు. అంతకుముందు శ్రీనగర్ కాలనీలోని మాజీ మంత్రి సబితా రెడ్డి స్వగృహంలో బి ఆర్ ఎస్ యువనేత పి కార్తీక్ రెడ్డిని కలిసి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.సబితా రెడ్డికి దసరా శుభాకాంక్షలు తెలిపిన వారిలో మాజీ వర్డ్ కమిటీ సభ్యులు సోమ శ్రీనివాస్ గుప్తా, బస్తీ నాయకులు కొంపల్లి జగదీష్, రాజు, అశోక్ కుమార్, సందీప్ గుప్త, కిషోర్, రామకృష్ణ, రవి, ప్రవీణ్, సన్నీ కుమార్, బి ఎల్ పి ఎల్ అనిల్ రాయుడు, సింహాద్రి, రీషి, కార్తీక్, బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# హైదర్ గూడలో దసరా వేడుకలు

బుద్వేల్, అక్టోబరు13(ప్రభాత ఉదయం) : అత్తాపూర్ డివిజన్ హైదర్ గూడ లో దసరా ఉత్సవాలు కన్నుల పండుగగా జరిగాయి. చారిత్రాత్మక చిన్న అనంతగిరి శివాలయం కేంద్రంగా ప్రణవభక్త సమాజం ఆధ్వర్యంలో జరిగిన వేడుకలలో అత్తాపూర్ చుట్టుపక్కల ప్రాంతాల కు చెందిన అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా పాల్గొని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా 85 అడుగుల భగవద్వజం ఆవిష్కరణ జరిగింది.


దసరా వేడుకల సందర్భంగా భగవద్వజమ్ ఆవిష్కరణ..


దసరా వేడుకలలో హైదర్ గూడ నాయకులు

# సొంతూరిలో సీఎం దసరా సంబరాలు

## సీఎం హెూదాలో తొలిసారిగా కొండారెడ్డిపల్లికి వచ్చిన రేవంత్‌రెడ్డి



నాగర్‌కర్నూల్/కొడంగల్, అక్టోబర్ 13 (ప్రభాత ఉదయం): : సీఎం రేవంత్‌రెడ్డి దసరా పండుగ సందర్భంగా శనివారం సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లిలో పర్యటించారు. ముఖ్యమంత్రి హెూదాలో తొలిసారి స్వగ్రామానికి వచ్చిన రేవంత్‌రెడ్డికి అడుగ డుగునా పూలు, డప్పు వాయిద్యాలు, బతుకమ్మలు, కోలాటాలతో గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల నడుమ దసరా వేడుకలు జరుపుకొన్న సీఎం రేవత్‌రెడ్డి అందరినీ పలకరిస్తూ గ్రామస్తుల్లో పండుగ సంబురాన్ని రెట్టింపు చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డి పల్లికి శనివారం మధ్యాహ్నం 3 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి హెలీకాప్టర్‌లో చేరుకున్నారు. కొండారెడ్డిపల్లి పంచాయతీ కార్యాలయం పలు అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి, కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యేలు చిక్కుడు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కాలినడకన శమీ పూజకు..

కొండారెడ్డిపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి తన ఇంటి నుంచి గ్రామంలోని మైసమ్మ ఆలయ ప్రాంగణంలో ఉన్న జమ్మి చెట్టు వద్దకు గ్రామస్తులతో కలిసి కాలినడకన బయలుదేరారు. మార్గమధ్యలో గ్రామస్తులను పేరుపేరునా పలకరిస్తూ.. ఆప్యాయంగా ముచ్చటిస్తూ జమ్మిచెట్టు వద్దకు చేరుకొని శమీ పూజలు నిర్వహించారు. అనంతరం ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు, అభిమానులు సీఎంతో సెల్ఫీలు, ఫొటోల కోసం పోటీ పడటంతో సుమారు 40 నిమిషాలపాటు వారితో ఫొటోలు దిగుతూ గ్రామస్తులను ఆనందంలో ముంచెత్తారు.

పాలమూరు బిడ్డగా ఉమ్మడి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపే బాధ్యత తనదని, ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతానని చెప్పారు. విద్య, వైద్యం, సాగునీరు, ఉపాధి కల్పనకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, వేగంగా నిర్ణయం తీసుకునేందుకు తాను సిద్ధంగా ఉన్నట్టు ఎమ్మెల్యేలు, అధికారులకు చెప్పారు. మరోసారి గ్రామానికి వచ్చి అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానన్నారు. రాత్రి 8.30 గంటలకు రోడ్డు మార్గంలో కొడంగల్‌కు బయలుదేరారు. కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్లు లింగ్యానాయక్, స్యుదీర్, సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి స్వాగతం పలికారు.

పూల మొక్కలు ఇచ్చి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ఉదయం నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు సీఎంను కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసూఫ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, యువజన కాంగ్రెస్ జాతీయ కోఆర్డినేటర్ కృష్ణంరాజు తదితరులు సీఎంను కలిశారు. పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి కొడంగల్‌కు వచ్చి ముఖ్యమంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



# మూసీ కాంట్రాక్ట్‌పై తప్పుడు ప్రచారం

## మన్నె క్రిశాంక్‌కు లీగల్ నోటీసులు

### నిరాధార ఆరోపణలు తగదన్న మెయిన్ హార్ట్ సంస్థ

### 24 గంటల్లోగా సారీ చెప్పాలని డిమాండ్

### ఏం చేసుకుంటారో చేసుకోమన్న క్రిశాంక్

హైదరాబాద్, అక్టోబర్ 13 (ప్రభాత ఉదయం): ప్రభుత్వాన్ని కార్నర్ చేయాలన్న లక్ష్యంతో పిచ్చిపిచ్చి ట్వీట్లు చేసి చివరకు నవ్వులపాలు అవుతుంటారు బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్. గతంలో ఓయూకు సంబంధించి ఫేక్ సర్క్యులర్ పోస్ట్ చేశారని పోలీసులు అరెస్ట్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కరెంట్, నీటి సమస్యలు వచ్చాయనే తప్పుడు ప్రచారాన్ని పబ్లిక్ లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేసినట్టు తేల్చారు. రిమాండ్ ఖైదీగా జైల్లో ఉండి బెయిల్‌పై బయటకొచ్చారు క్రిశాంక్. ఈ క్రమంలోనే మూసీ సుందరీకరణకు సంబంధించి మెయిన్ హార్ట్ సంస్థపై సంచలన ఆరోపణలు చేశారు. అదంతా తప్పుడు ప్రచారమని సదరు సంస్థ తాజాగా లీగల్ నోటీసులు పంపించడంతో ఈ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది.

### మన్నె ఆరోపణలు ఇవే !

మూసీ మాస్టర్ ప్లాన్ తయారీ కాంట్రాక్టును మెయిన్ హార్ట్ సంస్థకు అప్పగించారని, సదరు కంపెనీపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయని కొద్ది రోజుల క్రితం ట్వీట్లు, మీడియా ముందు వ్యాఖ్యలు చేశారు క్రిశాంక్. పాకిస్తాన్‌లో చేసిన ఓ ప్రాజెక్ట్‌కు సంబంధించి రూ.3వేల కోట్ల కుంభకోణానికి పాల్పడిందని అన్నారు. ఈయన ట్వీట్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా రీట్వీట్ చేశారు. దీంతో మెయిన్ హార్ట్ కంపెనీ అప్పుడే స్పందించింది. బీఆర్ఎస్ ఆరోపణలను ఖండించింది. తాము పాకిస్తాన్‌లో కన్సల్టెంట్‌గా మాత్రమే వ్యవహరించామని స్పష్టం చేసింది.

### సారీ చెప్పాల్సిందే !

మెయిన్ హార్ట్ సంస్థ రియాక్ట్ అయిన తర్వాత కూడా క్రిశాంక్ ఆరోపణలు చేస్తూనే ఉన్నారు. దీంతో నిరాధార ఆరోపణలు తగదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ లీగల్ నోటీసులు పంపించింది. తమ కంపెనీ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు దురుద్దేశంతోనే క్రిశాంక్ ఆరోపణలు చేశారని ఫైరయ్యింది. ఇలాంటి పనికిమాలిన ఆరోపణలు, పరువు నష్టం కలిగించే ప్రకటనలు మానుకోవాలని హితవు పలికింది. 24 గంటల్లోగా సారీ చెప్పి, తమపై చేసిన ట్వీట్లను తొలగించాలని డిమాండ్ చేసింది. లేకపోతే, న్యాయపరమైన చర్యలకు దిగుతామని హెచ్చరించింది.

### ఏం చేసుకుంటారో చేసుకోండన్న క్రిశాంక్

మెయిన్ హార్ట్ సంస్థ ఇచ్చిన నోటీసులపై క్రిశాంక్ స్పందించారు. నోటీసులపై కేటీఆర్‌తో చర్చించానని, బీఆర్ఎస్ లీగల్ సెల్ సమాధానం చెప్తుందని అన్నారు. రూ.3 వేల కోట్ల స్కాంలో మెయిన్ హార్ట్‌కు పాకిస్తాన్ నోటీసులు జారీ చేసింది నిజం కాదా? అని ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ట్వీట్లను తొలగించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. దీంతో మెయిన్ హార్ట్ సంస్థ ఎలా ముందుకు వెళ్తుందో అనే ఉత్కంఠ నెలకొంది.

# కర్ణాటకలో 'ముడా' ప్రకంపనలు.. ఖర్గే కీలక నిర్ణయం!

బెంగళూరు:, అక్టోబర్ 13 (ప్రభాత ఉదయం): గత కొంత కాలంగా మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) కర్ణాటకలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ వ్యవహారంలో సీఎం సిద్ధరామయ్యపై తాజాగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మనీలాండరింగ్ కేసు కూడా నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే కుటుంబం కీలక నిర్ణయం తీసుకుంది. ఆయన కుటుంబానికి సంబంధించిన సిద్ధార్థ విహార్ ట్రస్ట్‌కు గతంలో కర్ణాటక ఇండస్ట్రియల్ ఏరియాస్ డెవలప్‌మెంట్ బోర్డ్ (కేఐఏడీబీ) కేటాయించిన ఐదు ఎకరాల భూమిని స్వచ్ఛందంగా తిరిగి ఇచ్చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఖర్గే కుమారుడు రాహుల్ ఖర్గే నేతృత్వంలోని సిద్ధార్థ విహార్ ట్రస్ట్‌కు గతంలో కర్ణాటక ప్రభుత్వం.. బగలూరులోని హైటెక్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ పార్క్ హార్డ్‌వేర్ సెక్టార్‌లో ఐదు ఎకరాల భూమిని మంజూరు చేసింది. అయితే ఈ వ్యవహారాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా ఖండించాయి.



# తెలంగాణ ఉద్యమానికి అలయ్ బలయ్ స్ఫూర్తి

మొదటి పేజీ తరువాయి...

పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, గత 19 ఏళ్ల నుంచి దసరా సందర్భంగా రాజకీయాలకు అతీతంగా దత్తాత్రేయ ఈ అలయ్ బలయ్‌ను నిర్వహిస్తున్నారని చెప్పారు. అంతరించిపోతున్న సంస్కృతి సంప్రదాయాలను అలయ్ బలయ్ ద్వారా పునరుద్ధరించడానికి ఆయన ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. తెలంగాణ సంస్కృతిని నలు దిశలా వ్యాపించడానికి, ఉద్యమంలో రాష్ట్ర సాధన ఆలస్యం అయినప్పుడు పొలిటికల్ జేఏసీ ఏర్పాటుకు ఈ అలయ్ బలయ్ స్ఫూర్తిగా ఉపయోగపడిందని గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో రాజకీయ పార్టీల వారీగా కార్యక్రమాలు జరిగేవన్న సీఎం, తెలంగాణ ఉద్యమ సాధనలో అన్ని వర్గాలను కార్యోన్ముఖులై అడుగు ముందుకు వేయడానికి అలయ్ బలయ్ కూడా ఓ కారణమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలకు అతి పెద్ద పండుగ దసరా అని, దసరా అంటే పాలపిట్ట, జమ్మి చెట్టు గుర్తుకు వస్తాయన్నారు. అలాగే, అలయ్ బలయ్ అంటే గుర్తుకు వచ్చేది బండారు దత్తాత్రేయ అని చెప్పారు. ఆయన వారసురాలిగా అలయ్ బలయ్ నిర్వహిస్తున్న బండారు విజయలక్ష్మికి అభినందనలు తెలియజేశారు. ఆమె దిగ్విజయంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్న విశ్వాసం తనకు ఉందని చెప్పారు. అంతా ఒక్కటే తెలంగాణ సంప్రదాయాలు కాపాడుకోవడం మన బాధ్యత అని చెప్పేందుకు తమ ప్రభుత్వం, పార్టీ పెద్దలంతా అలయ్ బలయ్ కార్యక్రమంలో పాల్గొన్నామన్నారు. తామంతా ఒక్కటే అన్న సందేశాన్ని అలయ్ బలయ్ ద్వారా నాయకులు ఇచ్చారని పేర్కొన్నారు సీఎం రేవంత్ రెడ్డి.

# తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి పథాన నడవాలి: బండారు దత్తాత్రేయ

మొదటి పేజీ తరువాయి...

సామాజిక బాధ్యత –తోటివారి ఆలోచనలను, భావాలను గౌరవించటం కూడా ఐక్యత కిందకే వస్తుందని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య అన్నారు. అందరినీ ఒకే వేదిక మీద చూడటం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. రాజకీయ విభేదాలకు లిమిట్ ఉంటుందని, అది కేవలం సిద్ధాంతాల వరకే పరిమితమవ్వాలన్నారు. నేతలు వ్యక్తిగత దూషణలు చేస్తే కార్యకర్తలు కూడా అలాగే ప్రవర్తిస్తారని పేర్కొన్నారు. దీంతో సమాజానికి చెడు జరుగుతుందని, ఐక్యత, సమష్టి కోసం ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. సమైక్యత వారధుల నిర్మాణం ప్రతిఒక్కరి సామాజిక బాధ్యతగా పేర్కొన్నారు వెంకయ్య నాయుడు. పండుగలకు ఆధ్యాత్మిక ప్రాధాన్యతతో పాటు సామాజిక ప్రాధాన్యత కూడా ఉందని పేర్కొన్నారు. సమైక్యత అంటే అందరూ ఒకేమాట మీద నిలబడటమే కాదు, ఇతరుల ఇష్టాలను గౌరవించటం కూడా అని తెలిపారు. సమాజంలో ఐక్యతా స్ఫూర్తిని పెంపొందించేందుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని సూచించారు. అదిరిపోయే వంటకాలు %-% అలయ్ బలయ్ కార్యక్రమ అతిథులకు స్పెషల్ వంటకాలను ఏర్పాటు చేశారు. ఘుమఘుమలాడే, నోరూరించే తెలంగాణ వంటలను ప్రత్యేకంగా తయారు చేశారు. నోరూరించే తెలంగాణ సంప్రదాయక వంటకాలు చికెన్, మటన్ బిర్యానీ, చేపల పులుసు, చిరు ధాన్యాల ఉత్పత్తులు, జొన్న రొట్టె, సర్వపిండి, ఇతర పిండి వంటకాలు, గారెలు, బూరెలు వండారు. ఇవే కాకుండా బోటి, తలకాయ కూర, చేపల వేపుడు, చికెన్ వేపుడు, నల్ల, పాయ వంటి 60 రకాల స్పెషల్ వంటకాలను అతిథులకు వడ్డించినట్టు కమిటీ వెల్లడించింది.

# వైభవంగా ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

### శ్రీవారిని ఆరు లక్షల మంది భక్తులు దర్శించుకున్నారు

### టీటీడీ ఏర్పాట్లపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు: ఈవో

తిరుమల, అక్టోబరు 13 : తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. ధ్వజావరోహణం కార్యక్రమంతో సాలకట్ల బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా తిరుమల బ్రహ్మోత్సవాల విశేషాలను టీటీడీ ఈవో శ్యామలరావు వెల్లడించారు. అన్ని శాఖల సమన్వయంతో శ్రీవారి బ్రహ్మోత్సవాలను విజయవంతంగా పూర్తి చేశామన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బంగారు తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. అనంతరం ధ్వజావరోహణంతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. టీటీడీ ఏర్పాట్లపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేసినట్లు ఈవో శ్యామలరావు చెప్పారు. మొత్తం 6 లక్షలమంది శ్రీవారి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 2.60 లక్షల మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. 15 లక్షల మంది భక్తులు శ్రీవారి వాహనసేవలను తిలకించారు. అత్యంత కీలకమైన గరుడసేవ రోజున 82,043 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. గరుడసేవలో దాదాపు 3.5 లక్షల మంది భక్తులు పాల్గొన్నారు.ఏడు లక్షల లడ్డూలు బఫర్ స్టాక్ ఉంచారు. మొత్తం 30 లక్షల లడ్డూలను టీటీడీ విక్రయించింది. హుండీ కానుకల ద్వారా బ్రహ్మోత్సవాల సమయంలో రూ.26 కోట్లు ఆదాయం వచ్చినట్లు టీటీడీ తెలిపింది. శ్రీవారి భక్తులకు 32,713 గదులు కేటాయించారు. 475 లక్షల గ్యాలన్ల నీటిని వినియోగించారు. ఫల పుష్ప ప్రదర్శన, ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు.



# 'సాయిబాబా భౌతికకాయాన్ని మెడికల్ కాలేజీకి అప్పగిస్తాం'

## కుటుంబ సభ్యుల ప్రకటన

హైదరాబాద్, అక్టోబర్ 13 (ప్రభాత ఉదయం): ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్, పౌర హక్కుల ఉద్యమకారుడు జీఎన్ సాయిబాబా (54) శనివారం రాత్రి హైదరాబాద్ నిమ్స్‌లో కన్నుమూశారు.సాయిబాబా మృతదేహాన్ని ఆయన కోరుకున్న విధంగా మెడికల్ కాలేజీకి దానం చేయనున్నట్లు కుటుంబ సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.మావోయిస్టు సంబంధాలు ఉన్నాయన్న అభియోగాల కేసులో హైకోర్టు నిర్దోషిగా ప్రకటించడంతో మార్చి నెలలో ఆయన విడుదలయ్యారు. సాయిబాబా భౌతికకాయాన్ని ఆయన బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషుల నివాళులర్పించేందుకు సోమవారం హైదరాబాద్‌లోని జవహర్‌నగర్‌లో ఉంచనున్నట్లు తెలిపారు. ఆయన కళ్లను ఇప్పటికే ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.సాయిబాబా మృతిపట్ల 'ఎక్స్' వేదికగా ప్రముఖులు సంతాపం తెలిపారు. ప్రొఫెసర్ జి.ఎన్. సాయిబాబా మృతి పట్ల తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ సంతాపం తెలిపారు. " మానవ హక్కుల ఉద్యమకారుల సంఘానికి సాయిబాబా మరణం తీరని లోటు. అణగారిన ప్రజలకు జరిగిన అన్యాయాలకు వ్యతిరేకంగా, స్వేచ్ఛకు ముప్పు ఏర్పడినప్పుడు ఆయన అవిశ్రాంతంగా పోరాడారు. అనేక సవాళ్లను ఎదుర్కొంటూ పౌర హక్కులను కాపాడటంలో ఆయన చూపిన ధైర్యం చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఈ క్లిష్ట సమయంలో ఆయన కుటుంబానికి నా సానుభూతి తెలియజేస్తున్నా"అని ఎక్స్‌లో తెలిపారు.మాజీ ప్రొఫెసర్ జి.ఎన్. సాయిబాబా మృతి పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతాపం తెలిపారు. " హక్కుల ఉద్యమకారుడు మాజీ ప్రొఫెసర్ జీ.ఎన్. సాయిబాబా అకాల మరణం బాధాకరం. వారి కుటుంబసభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతి. దేశంలోని ప్రజా ఉద్యమాలకు మాజీ ప్రొఫెసర్ సాయిబాబా మరణం తీరని లోటు" అని 'ఎక్స్' తెలిపారు.

# దసరా సెలబ్రేషన్స్‌లో స్టార్ హీరోలు

## పంచకట్టులో ఆకట్టుకున్న చిరు





హైదరాబాద్, అక్టోబర్ 13 (ప్రభాత ఉదయం): మెగాస్టార్ చిరంజీవి కింగ్ నాగార్జున ఒకే చోటా కనిపించి అభిమానులకు కన్నుల విందు చేశారు. తాజాగా నాగార్జున , చిరంజీవి కలసి దసరా సెలబ్రేషన్స్ చేసుకోవడం గమనార్హం.కళ్యాణ్ జ్యువెలర్స్ ఎమ్.డి కళ్యాణ్ రామన్ ఇంట్లో నవరాత్రి ఉత్సవాలు చాలా ఘనంగా జరిగాయి.నాగార్జున ఎప్పటినుంచో కళ్యాణ్ జువెలర్స్ కి బ్రాండ్ అంబాసిడర్ గా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే దసరా వేడుకలకు ఆయనను ఆహ్వానించారు. అలాగే మెగాస్టార్ చిరంజీవిని కూడా దసరా వేడుకలకు ఆహ్వానించడం జరిగింది. దీంతో నాగార్జున, చిరంజీవి కలసి కళ్యాణ్ జ్యువెలర్స్ అధినేత కళ్యాణ్ రామన్ ఇంట్లో జరిగిన దసరా సెలబ్రేషన్స్లో సంయుక్తంగా పాల్గొని సందడి చేశారు.

### కళ్యాణ్ జువెలర్స్ అధినేత ఇంట్లో దసరా సంబరాలు..

ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో చిరంజీవి , నాగార్జున మధ్య ఎంత స్నేహం ఉందో మరొకసారి అందరికీ గుర్తు చేశారు వీరిద్దరు. ఇప్పుడు ఇలా ఇద్దరిని కలిసి మరోసారి చూడడంతో అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ఇరువురికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో చాలా వైరల్ గా మారుతున్నాయి. మెరూన్ ప్రింటెడ్ షర్ట్ ధరించి క్లాసిక్ అద్దాలతో మరింత క్లాస్ గా కనిపించారు నాగార్జున. మరొకవైపు పంచకట్టులో సాంప్రదాయంగా కనిపించి అందరినీ ఆకట్టుకున్నారు చిరంజీవి. ఇద్దరు కూడా తమ వేషధారణతో అభిమానులను విపరీతంగా ఆకట్టుకున్నారని చెప్పవచ్చు.

### చిరంజీవి కెరియర్..

ఇక చిరంజీవి విషయానికి వస్తే.. ఒకవైపు సినిమాలు మరొకవైపు వ్యాపార రంగంలో బిజీగా మారిపోయారు. గత ఏడాది వాల్తేరు వీరయ్య సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న ఈయన అదే ఏడాది భోళాశంకర్ సినిమా చేసి డిజాస్టర్ మూటగట్టుకున్నారు. ఇప్పుడు బింబిసారా డైరెక్టర్ వశిష్ట మల్లిడి దర్శకత్వంలో విశ్వంభర సినిమా చేస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి టీజర్ ను దసరా పండుగ సందర్భంగా విడుదల చేయగా.. ఒక వర్గం ప్రేక్షకులను విపరీతంగా మెప్పిస్తున్నా మరొక వర్గం ప్రేక్షకులు మొత్తం విఎఫ్ఎక్స్ అని హాలీవుడ్ మూవీ ని కాపీ చేశారు అంటూ కామెంట్లు కూడా వినిపిస్తున్నాయి. మరి ఈ సినిమా ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.

### నాగార్జున కెరియర్..

మరోవైపు కింగ్ నాగార్జున విషయానికి వస్తే.. హీరోగా చాలా చిత్రాలలో నటించి ప్రేక్షకులను మెప్పించిన ఈయన మరొకవైపు రజనీకాంత్ సినిమాలో విలన్ గా నటిస్తున్నట్లు సమాచారం. మొదటిసారి విలన్ అవతారం ఎత్తి తనలోని మరో యాంగిల్ ను చూపించబోతున్నారట నాగార్జున. అంతేకాదు బిగ్ బాస్ సీజన్ 8 కి హెూస్టుగా వ్యవహరిస్తూ మరొకసారి తన యాంకరింగ్ తో అందర్నీ ఆకట్టుకుంటున్నారు. ఇప్పటికే బిగ్ బాస్ మూడవ సీజన్ నుంచి హెూస్టుగా మారిన ఈయన ఇప్పటికీ హెూస్టు గానే కొనసాగుతూ మంచి పేరు సొంతం చేసుకున్నారు. మొత్తానికి అయితే టైర్ –1 హీరోలుగా పేరు సొంతం చేసుకున్న వీరిద్దరూ ఇప్పుడు ఒకే వేదికపై కనిపించి అభిమానులను ఖుషీ చేశారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.